## రేపు కుమ్మర్ల తొలి బోనాలు

- కుమ్మర్లు భారీగా తరలిరావాలి
- రేపాక రాంబాబు, సిలివేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూలై 5: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో బోనాల పండుగ సందడి ప్రారంభం కానుంది. దానిలో భాగంగా ఈ నెల 7న కుమ్మర్ల తొలి బోనాల జాతరను నిర్వహించనున్నట్లు బోనాల జాతర వ్యవస్థాపకులు రేపాక రాం బాబు, సిలివేరు వెంకటేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం నడి బొడ్డున్న ఉన్న ట్యాంక్‌బండ్ శ్రీశ్రీశ్రీ కనకాల కట్టమైసమ్మకు ఆన వాయితిగా వస్తున్న 501 బోనాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఉన్న కుమ్మర్లం దరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బోనాలను బిందె ల్లో కాకుండా కుండల్లో చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న అమ్మవారి దేవాలయాల్లో కుమ్మర్లనే పూజారుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూ లైన్

అమీర్‌పేట్, జూలై 5 : బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దర్శనానికి వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్న ఎస్ఆర్‌నగర్‌కు చెందిన రాయల సేవా సమితి అధ్యక్షులు ఆర్.సి.కుమార్ లిఖిత పూర్వక సూచనకు ఆలయ అధికారులు స్పందించారు. రాయల సేవా సమితి అధ్యక్షులు ఆర్. సి.కుమార్‌కు విజ్ఞప్తి మేరకు వారికి ఈ నెల 8న సోమవారం ఉదయం వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించనున్నట్లు శుక్రవారం దేవాలయ ఈవో కత్తా అంజనీదేవి తెలిపారు.

## ఎల్‌వోసీ అందజేత

అమీర్‌పేట్ బీజేఆర్‌నగర్-2కు చెందిన ఓ.శ్రీనివాస్ గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. నిమ్స్‌లో గుండె శస్త్రచికిత్స జరగాల్సి ఉండగా, నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితులను మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సీఎం సహాయ నిధి ద్వారా చేయూతనందించారు. ఈ మేరకు మంజూరైన రూ. 1.20 లక్షల ఎల్‌వోసీని పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎం.హనుమంతరావు, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.
– అమీర్‌పేట్, జూలై 5

## పెండింగ్ పనులు పూర్తి చేయండి

### జలమండలి జీఎంని కోరిన అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

జీఎం వినోద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, జూలై 5 : పెండింగ్ పనులను త్వరితగతిన చేపట్టాలని కోరుతూ అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి జలమండలి జీఎం వినోద్ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలని, అలాగే టెండర్ ప్రక్రియ పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ, శేషాపహాడ్ ప్రాంతాల్లో సీవరేజ్ పైపులైన్ పనులు, అడ్డగుట్ట సీ, డీ సెక్షన్‌లలో మంచి నీటి పైపులైన్ పనులను త్వరగా ప్రారంభించాలని ఈ సందర్భంగా జీఎంని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సమస్య తీవ్రంగా ఉందని, దానిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో బోర్లు పాడైపోయి నిరుపయోగంగా ఉన్నాయని, వాటికి సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపట్టాలన్నారు. జీఎంని కలిసిన వారిలో హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్ ఉన్నారు.

## విద్యారంగంలో విద్యార్థులు పోటీ పడాలి

### డిప్యూటీ సీఎం సతీమణి నందిని

మడ్‌ఫోర్టులోని ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని

మారేడ్‌పల్లి, జూలై 5: నేడు సాంకేతిక రంగం, విద్యా రంగంలోనూ ఎన్నో మార్పులు వస్తున్నాయని, నేటి అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు మారుతూ పోటీ ప్రపంచంలో విజయాలు సాధిస్తూ ఉన్నత ప్రమాణాలతో మంచి భవిష్యత్తును పొందాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని మల్లు అన్నారు. శుక్రవారం మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలకు బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ కృష్ణ పాడిశెట్టి ఆధ్వర్యంలో అభిబస్ సహకారంతో 10 కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నదని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంప్యూటర్లు పంపిణీ చేసిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ చైర్మన్ కృష్ణ పాడిశెట్టి మాట్లాడుతూ...తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని, మా సంస్థ కూడా విద్యార్థులకు చేయూత నందించేందుకు మా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. పాడైపోయిన కంప్యూటర్లు మా సంస్థకు ఇస్తే వాటిని రిపేర్ చేసి, కొన్ని సాఫ్ట్ వేర్‌లను అమర్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

### సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్,జూలై 5 : ప్రజల నుంచి తమకు వస్తున్న ఫిర్యాదులను వెంటనే అధికారులతో కలిసి పరిష్కరిస్తున్నామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. శుక్రవారం ఆమె డివిజన్ పరిధిలోని బ్రాహ్మణ బస్తీలో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతుందని ఫిర్యాదు చేయగా వెంటనే ఆమె స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు.సమస్య పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రియాంక, సిబ్బంది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణబస్తీలో అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తదితరులు

చిన్నారులకు క్యారం బోర్డును అందజేస్తున్న స్కై ఫౌండేషన్ ప్రతినిధులు

## చిన్నారులకు ఆట వస్తువుల పంపిణీ

అడ్డగుట్ట, జూలై 5 : మెట్టుగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కై ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు ఆట వస్తువులు, స్టేషనరీ, తిను బండారాలు అందించడంతో పాటు రోడ్డు పక్కన జీవనాన్ని సాగిస్తున్న సంచార జాతుల కుటుంబాల చిన్నారులకు జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం వారికి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ... సామాజిక సేవ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్న స్కై ఫౌండేషన్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని, ప్రతినిధులు హరీష్ కుమార్, అఖిల్, శుభం, గౌతమ్, సిద్ధార్థ, వితేశ్, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, శిరీష పాల్గొన్నారు.

## 86 మంది అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు

అమీర్‌పేట్ : రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీస్) డాన్‌బాస్కో దిశ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జాబ్ మేళా విజయవంతమైంది. సనత్‌నగర్‌లోని సెయింట్ థెరిస్సా చర్చి ఆవరణలోని డాన్‌బాస్కో దిశ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ జాబ్ మేళాలో టెక్ మహేంద్ర, ఎమ్‌పవర్ మెంట్, మెడ్ ప్లస్, రిలయెన్స్ డిజిటల్ సహా దాదాపు 10 కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 244 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 86 మంది అభ్యర్థులను ఎంపిక చేసిన ఆయా కంపెనీలు వారికి ఆఫర్ లెటర్లు అందజేశాయి. ఈ మేళాను విజయవంతం చేయడంలో దిశ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కోఆర్డినేటర్లు ఐవనో వాజ్, కార్తీక్ తదితరులు కృషి చేశారు.

జాబ్ మేళాలో ఆఫర్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు

## ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు

### సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్

బన్సీలాల్‌పేట్, జూలై 5 : ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ మండల తహసీల్దార్ ఇస్లావత్ పాండు నాయక్ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు ప్రభుత్వ ఖాళీ స్థలాలలో బోర్డులను ఏర్పాటు చేశామని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## దోమల నివారణపై అవగాహన



దోమల నివారణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజేందర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్, జూలై 5 : ఇండ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలను నివారించడం మన అందరి బాధ్యత అని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఏఎఫ్ఎ రాజేందర్ రెడ్డి అన్నారు. 'డ్రై డే-డ్రై డే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భోలక్‌పూర్‌లోని కృష్ణ వేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి పైకప్పులో పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి బోండాం లాంటి వాటిలో నీరు నిల్వ ఉండడం వలన అందులో లార్వా నుండి దోమలు ఉత్పత్తి అవుతాయని ఆయన వివరించారు. దోమల నివారణకు సహకరించాలని, తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు, ఎంటమాలజీ సిబ్బంది ఎల్లయ్య, శ్యామ్ సుందర్, మిర్జా అన్సారీ బేగ్‌లు పాల్గొన్నారు.

అన్నదానం: రెండో వార్డు రసూల్‌పురా ఉషా గోడౌన్స్ సమీపంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో దేవులపల్లి శ్రీనివాస్,అజ్జు,అహ్మద్,దేవరాజ్ అన్నదాన కమిటీ సభ్యులు నరసింహారెడ్డి,శ్యామ్ రెడ్డి,రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. –బొల్లారం, జూలై 5

## చిలకలగూడలో హత్య

అడ్డగుట్ట, జూలై 5: చిలకలగూడ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ కథనం ప్రకారం.. ఉప్పర బస్తీలో ఓ వ్యక్తి భవనం నిర్మిస్తున్నాడు. ఆ భవనంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన రామచంద్రయ్య(45) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. రామచంద్రయ్య, స్వరూప దంపతులు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఉదయం రామచంద్రయ్య రెండో అంతస్తులో విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించిన నిర్మాణదారులు స్థానిక చిలకలగూడ పోలీసులకు సమాచార మిచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హత్య ఎలా జరిగింది.. ఎవరు చేశారు.. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇదిలా ఉండగా.. సదరు భవనంలో రామచంద్రయ్యతో పాటు బండలు వేసే వ్యక్తి, మరో వాచ్‌మన్ కూడా ఉంటారని తెలిసింది. ఈ ముగ్గురు కలిసి గురువారం రాత్రి మద్యం సేవించారని, మద్యం మత్తులో వారి మధ్యలో ఫోన్ విషయమై గొడవ జరగడంతో రామచంద్రయ్యను కోపంలో రాడ్‌తో కొట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్టు తెలిసింది. దీంతో రామచంద్రయ్య అపస్మారక స్థితిలో వెళ్లి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

## 400 పుస్తకాల వితరణ

విశ్రాంత వీసీ నుంచి పుస్తకాలను అందుకుంటున్న ఆకర్షణ

అమీర్‌పేట్, జూలై 5 : తాను సేకరించిన పుస్తకాలతో ఇప్పటివరకు 11 గ్రంథాలయాలు ఏర్పాటు చేసిన బేగంపేట్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 8వ తరగతి విద్యార్థి ఆకర్షణ సతీష్ (12) చొరవకు తన వంతు సహకారంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్ ఛాన్స్‌లర్ ప్రొ. తంగెడ కిషన్‌రావు శుక్రవారం 400 పుస్తకాలను బహూకరించారు. ఇప్పటి వరకు 11 గ్రంథాలయాలను నెలకొల్పడం జరిగిందని, 6న తన 12వ గ్రంథాయాలన్ని మేడ్చల్ జిల్లాలోని పోచారం గ్రామంలో ఓ ఎయిడ్స్ బాధితులు సంరక్షణ పొందుతున్న ఆశ్రమంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవారంలో 13వ గ్రంథాలయాన్ని బోరబండలో ఏర్పాటు చేస్తానని, ఈ సంవత్సరం డిసెంబర్ చివరి నాటికి మొత్తం 25 గ్రంథాలయాలను నెలకొల్పుతానని ఆకర్షణ తెలిపారు.

కాకాగూడలో ఆధార్

## సెంటర్ ప్రారంభం

కంటోన్మెంట్ ఐదో వార్డు తిరుమలగిరి పోస్టాఫీసు సహకారంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు రావుల సతీష్ ఆధ్వర్యంలో కాకగూడ హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను రావుల సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు రోజుల పాటు స్థానిక ప్రజల సౌకర్యార్థం కోసం ఈ ఆధార్ సెంటర్ అందుబాటులో ఉంటుందని , ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఆధార్ సెంటర్‌లో నూతన ఆధార్ కార్డుతో పాటు, మార్పులు, చేర్పులు, సవరణలు, చిరునామా వాటిని సరిదిద్దుకోవచ్చన్నారు.– మారేడ్‌పల్లి

## ఎట్టకేలకు స్పందించిన అధికారులు

తుకారాంగేట్ పహాడి హనుమాన్ నుంచి ఆర్‌సీసీ మైదానం రోడ్డులో మురుగునీరు పొంగిపొర్లుతున్న విషయమై ' అధికారులు స్పందించేది ఎప్పుడో ' అని నమస్తే తెలంగాణ దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జలమండలి జీఎం వినోద్‌కుమార్ స్పందించారు. ఈ మేరకు సదరు ప్రాంతంలో మురుగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాడు. దీంతో సిబ్బంది ఆ ప్రాంతంలో జెట్టింగ్ వాహనంతో మ్యాన్‌హోళ్లను పూర్తిగా శుభ్రం చేసి అందులో నుండి వ్యర్థాలను వెలికితీశారు. ఇకనుంచి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని జలమండలి జీఎం వినోద్‌కుమార్ తెలిపారు. – అడ్డగుట్ట, జూలై 5 :

## వ్యక్తి అదృశ్యం

విజయ్‌కుమార్ (ఫైల్)

అడ్డగుట్ట, జూలై 5 : మానసిక స్థితి సరిగాలేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... తుకారాంగేట్ కొండారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్(42)కు మానసికస్థితి సరిగాలేదు. అయితే ప్రతిరోజూ ఉదయం బయటికెళ్ళి వస్తుంటాడు. గత నెల 12న ఇంట్లో టిఫిన్ చేసి ఉదయం 11 గంటలకు బయటికి వెళ్లిన అతను మళ్లీ తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు వారి బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో విజయకుమార్ కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్య కిట్లు పంపిణీ

కుష్ఠు బాధితులకు ఆరోగ్య కిట్‌లను అందజేస్తున్న ఎన్‌టీపీసీ జీఎం పాణిగ్రహి

బన్సీలాల్‌పేట్, జూలై 5 : నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం 60 మంది కుష్ఠు బాధితులకు వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ కిట్‌లను పంపిణీ చేశారు. భాగ స్వామ్య స్వచ్ఛంద సంస్థ లెప్రా కేర్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన 'సమగ్ర వైకల్య నివారణ' ప్రత్యేక శిబిరానికి ముఖ్య అతిథిగా దక్షిణ ప్రాంతీయ కేంద్ర కార్యాలయం జనరల్ మేనేజర్ ఎస్ఎన్.పాణిగ్రహి హాజరై మాట్లాడుతూ కుష్ఠును ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే చికిత్స సులభం అవుతుందన్నారు. ఆహార నియమాలలో వైద్యుల సూచనలు పాటించాలన్నారు. తమ ఎన్‌టీపీసీ చేపట్టిన ప్రజా ఉపయోగ సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

### దేవాదాయ అర్చక, ఉద్యోగ రాష్ట్ర జేఏసీ

## గౌరవాధ్యక్షుడిగా కరుణాకర్ నాయుడు

బన్సీలాల్‌పేట్, జూలై 5 : తెలంగాణ దేవాదాయ అర్చక, ఉద్యోగ ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) కార్యవర్గ సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా గంధం కరుణాకర్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రాల విభజన చట్టం ప్రకారం ఏపీ నుంచి తెలంగాణ దేవాదాయ శాఖకు వెయ్యి కోట్ల రూపాయల బకాయిలు రావాల్సిఉన్నదని, ఏపీ సీఎం చంద్రబాబుతో జరిగే భేటీలో ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చర్చించి వాటిని రప్పించాలని కోరుతున్నామన్నారు. ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేయాలని, పదవీ విరమణ చేసిన అర్చకులకు రూ.10 లక్షల గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 18 వేల దేవాలయాలు ఉన్నాయని, వాటికి 1.21 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయని, కొన్ని చోట్ల ఎకరం రూ.వంద కోట్లు ధర ఉన్నదని, ప్రభుత్వం ఆ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తనపై నమ్మకంతో గౌరవ అధ్యక్షుడిగా నియమించిన కార్యవర్గానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## హుండీ చోరీ యత్నించిన కేసులో ముగ్గురు రిమాండ్

మారేడ్‌పల్లి, జూలై 5: కార్ఖానాలోని బీఆర్ఓ జంక్షన్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో హుండీ చోరీకి ప్రయత్నించిన ముగ్గురు యువకులను కార్ఖానా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ముషీరాబాద్ డీబీఆర్ మిల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ కైఫ్ ( 20) కారు డెంటింగ్ వర్కర్‌గా పని చేస్తుంటారు. యాప్రాల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ తాహీర్ (20) ఎలక్ట్రిషన్‌గా, లోయర్ ట్యాంక్ బం డ్ ప్రాంతానికి చెందిన బి. రోహిత్ సైతం డెంటింగ్ వర్క్ చేస్తుంటాడు. స్నేహితులైన వీరు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న కార్ఖానా బీఆర్ఓ జంక్షన్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయంలో ముగ్గురు కలిసి ఆలయంలో హుండీ చోరీకి వెళ్లారు. ఆలయంలో మహ్మద్ కైఫ్ ప్రవేశించగా మిగితా ఇద్దరు ఆలయం బయట ఉండగా....కైఫ్ హుండీ పగలగొడుతున్న సమయంలో శబ్దం విని స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆలయం బయట ఉన్న వారు పారిపోయారు. ఆలయం లోపల ఉన్న నిందితుడు కైఫ్‌ను పట్టుకున్నారు. కైఫ్‌ను పట్టుకొని కార్ఖానా పోలీసులకు అప్పగించడంతో వారు అతడిని అదుపులోకి తీసుకొని విచారించడంతో మిగితా ఇద్దరికి సంబంధించిన వివరాలు చెప్పాడు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు మిగితా ఇద్దరిని అదుపులోకి తీసుకొని కార్ఖానా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గంగపుత్రులు కలిసి కట్టుగా ఉండాలి

సికింద్రాబాద్,జూలై 5: గంగపుత్రులు కలిసి కట్టుగా ఉంటూ తమకు రావాల్సిన హక్కులను సాధించుకోవాలని గంగపుత్ర స్థానిక సంఘం అధ్యక్షుడు కర్మకొండ సత్యనారాయణ పిలుపునిచ్చారు.శుక్రవారం తెలంగాణ గంగ పుత్ర అభివృద్ధి సంస్థ హైదరాబాద్ (సికింద్రాబాద్ పార్లమెంట్ విభాగం )సమావేశం బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడలోని గంగ పుత్ర స్థానిక సంఘం భవనంలో జరిగింది.ఈ సమావేశంలో గంగ పుత్రుల సమస్యలపై చర్చించి కొన్ని తీర్మానాలు చేశారు. ముఖ్యంగా జీవో నంబర్ 6ను పూర్తిగా రద్దు చేయాలని, గంగ పుత్రులకు ఉప్పల్ భగాయత్ లో కేటాయించిన స్థలములో నిర్మాణం చేపట్టాలన్నారు. అదేవిధంగా ఇతర కులాల వారిని బీసీఏలో చేర్చే ప్రయత్నంను ప్రభుత్వం మానుకోవాలన్నారు.ఈ సమావేశంలో సంస్థ గౌరవ అధ్యక్షులు గాలి సత్యనారాయణ, కార్య వర్గ సభ్యులు, రాంనగర్ ముషీరాబాద్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న గంగపుత్ర సంఘం నాయకులు.